సాక్షి
చిత్తూరు
బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



దూసుకొచ్చిన లారీ

తిరుపతి రూరల్ : చంద్రగిరి మండలం కొంగర వారిపల్లె వద్ద మంగళవారం ఓ లారీ అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొని పక్కనే ఉన్న మామిడితోటలోకి దూసుకెళ్లింది. - 8లో



'మల్లాడి డ్రగ్స్'లో అగ్నిప్రమాదం

రేణిగుంట: గాజులమండ్యం కెమికల్ ఎస్టేట్‌లో ఉన్న మల్లాడి డ్రగ్స్ కర్మాగారంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	40	23
తిరుపతి	41	23
తిరుమల	37	19
గూడూరు	42	26
నగరి	42	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం(సా)	సహర్ గురువారం(ఉ)
తిరుపతి	6.29	4.36
చిత్తూరు	6.31	4.36
పుంగనూరు	6.33	4.40

భీకరి భయం!

కౌండిన్య అటవీ ప్రాంతం దాటి గజరాజులు బయటకు వచ్చేస్తున్నాయి.. గతంలో ఏర్పాటు చేసిన నాసిరకం సోలార్ ఫెన్సింగ్‌ను తొక్కుకుంటూ దాటేస్తున్నాయి.. ఎలిఫెంట్ ట్రెంచ్‌లను పూడ్చుకుంటూ సమీప గ్రామాల్లోకి చొరబడుతున్నాయి.. పంట పొలాలను ధ్వంసం చేసేస్తున్నాయి.. పండ్ల తోటల్లో చెట్లను విరిచేస్తున్నాయి.. కనిపించిన వారిపై దాడులకు పాల్పడుతున్నాయి.. దొరికినవారి ప్రాణాలను క్షణాల్లో తీసేస్తున్నాయి.. ఈ క్రమంలో భీ'కరి' ఘీంకారం విని పిస్తే జనావాసాలు గజగజా వణుకుతున్నాయి.. అడవిలో ఆహారం.. నీటి కొరత వల్లే ఏనుగులు ఊళ్లలోకి ప్రవేశిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.. హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌తోనే కట్టడి సాధ్యమని తెలియజేస్తున్నారు.. ఆ దిశగా చర్యలు చేపట్టినట్లు వెల్లడిస్తున్నారు.



పలమనేరు వద్ద ఏనుగుల గుంపు (ఫైల్)



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఏనుగులు (ఫైల్)



- కౌండిన్య అటవీ సరిహద్దులు దాటుతున్న ఏనుగులు
- ఆహారం, నీటి కొరతతో బయటకు వచ్చేస్తున్న గజరాజులు
- కుప్పం నుంచి శేషాచలం వరకు సంచారం
- పంట పొలాలపై యథేచ్ఛగా దాడులు
- ఆందోళన చెందుతున్న రైతులు
- హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌తోనే కట్టడి సాధ్యమంటున్న ఫారెస్ట్ అధికారులు

సాక్షి, చిత్తూరు : కౌండిన్య అభయారణ్యం పరిధిలో సుమారు 110 ఏనుగులు సంచరిస్తున్నాయి. అలాగే తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా, కర్ణాటకలోని కోలారు జిల్లాలోని అడవుల నుంచి కూడా ఏనుగులు వస్తున్నాయి. వేసవి నేపథ్యంలో తీవ్రమైన ఆహారం, నీటి కొరత కారణంగా గజరాజులు అటవీ ప్రాంత సరిహద్దుల్లోని గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ప్రధానంగా పలమనేరు, కుప్పం, పూతలపట్టు, పుంగనూరు నియోజకవర్గాల్లో వీటి రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వర్షాలు విస్తారంగా కురిస్తే ఏనుగులకు ఆహారం, తాగునీరు లభ్యత ఉంటుంది. ఆ సందర్భాల్లో జిల్లాలోకి వచ్చే ఏనుగుల సంఖ్య చాలా తక్కువే. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లోని ఆశించిన మేర వర్షపాతం లేకపోవడంతో ఏనుగులు గుంపులు గుంపులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లోకి వచ్చేస్తున్నాయి.

రైతుల ఆందోళన

ఏనుగుల గుంపు పంట పొలాల్లోకి ప్రవేశిస్తే ఎకరాలకు ఎకరాలే నాశనమవుతాయి. ముఖ్యంగా వరి, చెరుకు, మామిడి, అరటి, కూరగాయల పంటలు కనిపిస్తే విడిచిపెట్టవు. ప్రస్తుతం ఏనుగు సంచారంతో అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాల్లోని రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. చేతికందే దశలోని మామిడి, అరటి తోటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. భయం గుప్పిట్లో జీవనం సాగిస్తున్నారు. అటవీ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టి ఏనుగులను అడవుల్లోకి మళ్లించాలని కోరుతున్నారు.

సాధారణంగా ఏనుగులు ఆహారం, నీటి కోసం రోజుకు సుమారు 40 కిలోమీటర్ల వరకు నడక సాగిస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో మదపుటేనుగులు చాలా క్రూరంగా ప్రవర్తిస్తాయి. అందులోనూ ఒంటరి ఏనుగులైతే మరింత ప్రమాదకరంగా ఉంటాయి. మనుషులు, పశువులు, కుక్కలను వెంటాడి మరీ హతమారుస్తుంటాయి.

15 మంది మృత్యువాత

ఏనుగుల దాడిలో 2009 నుంచి ఇప్పటి వరకు మొత్తం 15 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలోనే గాయపడ్డారు. అలాగే 47 పశువులు, ఇతర జంతువులు మృత్యువాత పడ్డాయి. గజదాడుల్లో మృతి చెందిన వారికి ప్రభుత్వం నుంచి సుమారు రూ.69.50 లక్షల పరిహారం అందింది. గాయపడిన వారికి రూ.7.46 లక్షలు ముట్టింది. దాదాపు 4,926 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఇందుకు గాను రూ.3.54 కోట్ల వరకు బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారంగా చెల్లించింది.

బలహీనమైన ఫెన్సింగ్

కౌండిన్య అటవీ సరిహద్దులో సుమారు 66 కిలోమీటర్ల మేర సోలార్ ఫెన్సింగ్‌ను గతంలో నిర్మించారు. చాలా ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్‌కు అమర్చిన డీసీ బ్యాటరీలు పనిచేయకపోవడంతో విద్యుత్ ప్రవహించక నిరుపయోగంగా ఉంది. ఆయా ప్రాంతాల నుంచి పైపులను విరిచేసి ఏనుగులు వెలుపలికి వచ్చేస్తున్నాయి. సుమారు 74 కిలోమీటర్ల పరిధిలో 12 చోట్ల చేపట్టిన ఎలిఫెంట్ ట్రెంచెస్ పనులు వివిధ కారణాలతో అసంపూర్ణంగా ఉన్నాయి. దీంతో వాటిని ఏనుగులు సులువగా అధిగమిస్తున్నాయి.

ఏనుగులకూ ప్రాణసంకటం

ఆహారం, నీటి కోసం ఏనుగులు అడవి దాటితే వాటి పరిస్థితి ప్రాణసంకటంగానే ఉంటోంది. వివిధ ప్రమాదాలకు గురై మరణిస్తున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 19 ఏనుగులు మృత్యువాత పడినట్లు అటవీ అధికారులు వెల్లడిస్తున్నారు. గజరాజులు అభయారణ్యంలో ఉంటే సురక్షితంగా ఉంటాయని, వాటిని సరిహద్దులు దాటకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని వివరిస్తున్నారు.

ఎలిఫెంట్ కారిడార్‌తో శాశ్వత పరిష్కారం

ఏపీతోపాటు తమిళనాడు, కర్ణాటక సంయుక్తంగా కేంద్రప్రభుత్వంతో కలిసి ఎలిఫెంట్ కారిడార్ ఏర్పాటు చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ఆ దిశగా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే సమస్య మరింత జటిలంగా మారుతుందే కానీ, పరిష్కారం దొరకదని స్పష్టం చేస్తున్నారు.



కౌండిన్య అటవీప్రాంతం



గత టీడీపీ ప్రభుత్వంలో కాల్వపల్లె వద్ద నిర్మించిన నాసిరకం ట్రెంచ్

హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌తో సత్ఫలితాలు



"గతంలో నిర్మించిన ఫెన్సింగ్‌ను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. అందుకే హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్ విధానం ప్రవేశపెట్టాం. ఇది సత్ఫలితాలిస్తోంది. పలమనేరులో 2, కుప్పంలో 4 కిలోమీటర్ల మేర రూ.38.42 లక్షలతో హ్యాంగింగ్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాం. మరో 25 కిలోమీటర్ల నిర్మాణం కోసం రూ.1.60 కోట్లకు ప్రతిపాదనలు పంపించాం. ఏనుగుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉంటున్నాం.

– చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌ఓ, చిత్తూరు

న్యూస్‌రీల్

గంగ జాతర పోస్టర్ ఆవిష్కరణ



జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీకే బాబు

చిత్తూరు రూరల్: చిత్తూరు నడివీధి గంగమ్మ జాతర పోస్టర్‌ను వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు మంగళవారం ఆవిష్కరించారు. నగరంలోని పొన్నియమ్మ ఆలయంలో గంగ జాతర నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగరంగ వైభవంగా జాతర జరిపించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. మే 9న జాతర చాటింపు ఉంటుందన్నారు. 16వ తేదీ ఉదయం అమ్మవారిని కొలువుదీర్చి జాతరకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. విశేష పూజలు, అంబలి సమర్పణ అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నట్లు చెప్పారు. 17వ తేదీన ఓం శక్తి భక్తుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు వాయిద్యాల నడుమ గంగమ్మ ఊరేగింపు ఉంటుందని వివరించారు. జాతరకు భక్తులు సహకరించాలని కోరారు. సమావేశంలో నిర్వాహకులు వెంకటేష్, గుణ, హేమంత్, రవి, ఓంశక్తి సంఘం అధ్యక్షులు సరిత పాల్గొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలను బుధవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు 1–7 స్థాయీ సంఘాల సమావేశాలు జరుగనున్నట్లు వెల్లడించారు.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షల మూల్యాంకనాన్ని బుధవారం నుంచి ప్రారంభిస్తున్నామని, 26వ తేదీ వరకు కొనసాగుతుందని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం చిత్తూరులోని పీసీఆర్ పాఠశాలలో ఆయన సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ మూల్యాంకనానికి పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. విధులు కేటాయించిన 1,200 మంది తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఈ మేరకు ముందస్తుగానే సంబంధిత అధికారులకు సూచనలను జారీచేశామన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు 40 జవాబుపత్రాలు దిద్దేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సమావేశంలో డీవైఈఓ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు అరుణ్, మోహన్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు పకడ్బందీ చర్యలు



డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఆర్‌ఓ రాజశేఖర్ ఆదేశించారు. మంగళవారం ఈమేరకు ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. అంబేద్కర్ గురుకులంలో 5 వతరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 23వ తేదీన పరీక్ష జరుగనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని 7 కేంద్రాల్లో 5వ తరగతికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జూనియర్ ఇంటర్‌కు సంబంధిఅంచి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల రవాణాకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పేదలు బాగుపడితే.. ప్రతిపక్షాలకు కడుపు మంట



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- మా ప్రభుత్వంలో సంక్షేమ పాలన అందించాం
- ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రలు
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం : పేదలు ఆర్థికంగా వృద్ధి చెందాలి, బలహీనవర్గాల వారు సైతం ఉన్నత చదువులు చదవాలి, సంపద సృష్టితోనే పీడితుల తలరాతలు మార్చాలన్న ఆకాంక్షతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విషం ఎందుకు చిమ్ముతున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని అడపాలబైలు గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. 'పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షాల కడుపు ఎందుకు మండిపోతోందో అర్థం కాలేదు. పలు సంక్షేమ పథకాల ద్వారా అణగారిన వర్గాలకు ఆర్థికసాయం చేసి ఆదుకుంటుంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎందుకు ఓర్వలేకపోతున్నారు. కేవలం అధికార దాహంతో మోసగాళ్లు ఒక్కటై సీఎం జగన్‌ను ఎదుర్కోవాలని చూస్తున్నారు. పవన్ ఓ యాక్టర్.. లోకేష్ ఓ కమెడియన్. పవన్ పార్టీ పెట్టి చంద్రబాబును సీఎం చేయాలని తపిస్తున్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తెలంగాణ మంత్రులకు తాకట్టు పెట్టిన దత్తపుత్రుడి గురించి ప్రజలకు తెలుసు. దమ్ముంటే 175 స్థానాల్లో జనసేన పార్టీ అభ్యర్థులను పెట్టి గెలిపించాలి. బడుగు, బలహీన వర్గాల వారిని హేళనచేసి మాట్లాడిన లోకేష్.. మేం లేకపోతే నిన్ను మోస్తున్నది మోసేది ఎవరో తెలుసుకో. మన రాష్ట్రానికి పట్టిన శని చంద్రబాబు. స్కామ్‌లు, దోపిడీల్లో బాబు అండ్ కో అక్రమంగా వేల కోట్లరూపాయలు దోచుకున్నారు. టీడీపీ ముసుగులో రామోజీ అవినీతి సామ్రాజ్యాన్ని నెలకొల్పారు. పెత్తందారులు, సంపన్నుల కోసం ఆరాటపడుతున్న చంద్రబాబుకు పతనం ఖాయం'' అని అన్నారు.

సుపరిపాలనలో దేశానికే దిశానిర్దేశం

- మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేస్తున్నాం
- ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి రోజా



మంత్రి రోజాకు హారతి ఇస్తున్న కంటి ఆపరేషన్ చేసుకున్న వృద్ధురాలు

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజకంగా సుపరిపాలన అందిస్తూ దేశానికే దిశానిర్దేశం చేస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా కొనియాడారు. మంగళవారం పట్టణంలోని 20వ వార్డు సత్రవాడ దళితవాడలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుక చర్యలు చేపట్టారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్నికల హామీలను అధికారంలోకి వచ్చిన 46 నెలల్లోనే దాదాపు 98.5శాతం నెరవేర్చామన్నారు. ముఖ్యమంత్రి జగనన్న సారథ్యంలో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా, పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వెల్లడించారు. అవినీతికి తావు లేకుండా, పారదర్శంగా లబ్ధిదారుల ఖాతాలోనే నగదు జమ చేస్తున్నామని తెలిపారు. మన రాష్ట్రంలో విప్లవాత్మకంగా అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాల వారు అనుసరిస్తున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో దుర్మార్గ పాలన, నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని వివరించారు. ఈ రెండింటి మధ్య వ్యత్యాసమే వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇటీవల రోజా చారిటబుల్ ట్రస్ట్ వారు నిర్వహించిన నేత్ర వైద్యశిబిరంలో చికిత్స పొందిన వృద్ధులు ఆనందంగా ముందుకు వచ్చి మంత్రి రోజాకు హారతి ఇవ్వడం ప్రత్యేకతను సంతరించుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణన్, నేత అనుబంధ సంఘం జిల్లా అధక్షుడు కన్నాయిరం, సచివాలయ కన్వీనర్ దయానిధి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, సీఐ శ్రీనివాసంతి, నాయకులు మురుగా, ఎస్సీ ఆనందకుమార్, రాజముత్తు పాల్గొన్నారు.

పవిత్ర దీక్షకు కానుక

- ముస్లింలకు రంజాన్ బహుమతి
- 10వేల కుటుంబాలకు నిత్యావసర సరుకులు



పంపిణీకి సిద్ధంగా రంజాన్ కానుక



కానుకను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం, జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

చిత్తూరు రూరల్ : నగరంలోని పీవీకేఎస్ మైదానంలో ముస్లింలకు రంజాన్ కానుకను ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేతుల మీదుగా ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ పవిత్ర మాసంలో ముస్లింలు చేపట్టిన దీక్షలు మంచి ఫలితాలు ఇవ్వాలని కోరారు. ముస్లింలకు సేవ చేస్తున్న విజయానందరెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు అందరిపై అల్లా కటాక్షం ఉండాలని ఆకాంక్షించారు. మైనారిటీలంటే జగనన్నకు ప్రత్యేక అభిమానమని, వైఎస్సార్‌సీపీ అంటే మైనారిటీల పార్టీ అని వివరించారు. ముస్లింలు ఎక్కడ కనిపించినా జగనన్న ఆప్యాయంగా పలకరిస్తుంటారని తెలిపారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ చిత్తూరు, జీడీ నెల్లూరు నియోజకవర్గ ప్రజలకు విజయానందరెడ్డి తోడుగా ఉంటూ కానుక ఇస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగుజాడల్లోనే విజయానందరెడ్డి సైతం నిత్యం ప్రజాసేవలోనే పయనిస్తున్నారని తెలిపారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకుని వేలాది కుటుంబాలకు తోఫా ఇవ్వడం అభినందనీయమన్నారు. మైనారిటీలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ముస్లింల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి పలు పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగి ఇమామ్‌లకు గౌరవ వేతనం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ముస్లింలు ప్రార్థనలు చేయాలని కోరారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ 10 వేల కుటుంబాలకు రూ.2,200 చొప్పున విలువైన నిత్యావసర సరుకులను కానుకగా అందిస్తున్నామని తెలిపారు. అనంతరం ఇఫ్తార్ విందు ఇచ్చారు. మైనారిటీ కార్పొరేషన్ ఈడీ చిన్నారెడ్డి, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24న సివిల్ జడ్జి ఉద్యోగాలకు పరీక్ష

చిత్తూరు అర్బన్: సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఉద్యోగాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అభ్యర్థులకు ఈ నెల 24వ తేదీ ఉదయం 8–30 నుంచి 10.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఐఓఎన్ డిజిటల్ జోన్ ఐడీజెడ్, జూ పార్కు తిరుపతి, జూ పార్కు రోడ్డు, చెర్లోపల్లెలో పరీక్ష జరుగనున్నట్లు వెల్లడించారు. పరీక్ష సమయానికి 15 నిమిషాలకు ముందుగానే హాజరుకావాలని స్పష్టం చేశారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించరని తెలిపారు.

వేగంగా పాలిటెక్నిక్ భవనాల నిర్మాణం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో వ్యవసాయ, పశుసంవర్ధక పాలిటెక్నిక్ భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన వరుస సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చౌడేపల్లె వ్యవసాయ పాలిటెక్నిక్, సదుంలో వెటర్నరీ పాలిటెక్నిక్‌ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్త సుబ్రమణ్యం మాట్లాడుతూ శుభారామ్ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం వ్యవసాయ పాలిటెక్నిక్ నిర్వహిస్తున్నామని, 43 మంది విద్యార్థులు రెండు బ్యాచులుగా చదువుతున్నారని తెలిపారు. పాలిటెక్నిక్ నిర్మాణం కోసం ఇప్పటికే 58 ఎకరాలు సేకరించినట్లు వెల్లడించారు. తిరుపతి వెటర్నరీ వర్సిటీ రిజిస్ట్రార్ రవి మాట్లాడుతూ సదుంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో వెటర్నరీ పాలిటెక్నిక్ తరగతులు జరుగుతున్నట్లు చెప్పారు. 30మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో జేసీ పులి శ్రీనివాసులు, ఎస్టేట్ ఆఫీసర్ నగేష్, ప్రిన్సిపల్ నసీరుద్దీన్, పలమనేరు ఆర్‌డీఓ శివయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సగిలి షణ్మోహన్ ఆదేశించారు. ముందస్తు జాగ్రత్తలతో పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ట్రాన్స్‌కో ఏఈ, తహసీల్దార్, ఎంపీడీఓలతో మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి తాగునీటి ఇక్కట్లను పరిష్కరించాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

బాలుడి అదృశ్యం


షాదిక్ (ఫైల్)

పలమనేరు : పట్టణానికి చెందిన అఫ్రష్‌ఖాన్ కుమారుడు షాదిక్ (16) ఆదివారం నుంచి కనిపించడంలేదని, ఆచూకీ తెలిసిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నాగరాజు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని వెల్లడించారు.

విద్యుత్ తీగలు తగిలి లారీకి మంటలు


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వి.కోట: మండలంలోని కారకుంటలో మంగళవారం విద్యుత్ వైర్లు తగిలి పశుగ్రాసం తరలిస్తున్న లారీలో మంటలు చెలరేగాయి. లారీ రివర్స్ తిప్పుకునే క్రమంలో విద్యుత్ తగలడంతో ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు లారీలోని గడ్డిని కింద పడేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

'మనసు'కు వైద్యం

- చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో మానసిక రుగ్మతలకు చికిత్స
- ప్రత్యేక విభాగానికి పెరిగిన ఓపీలు
- మెరుగైన సేవలందిస్తున్న వైద్యులు

మానసిక రుగ్మతలకు జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు.. ప్రత్యేక విభాగాన్ని కేటాయించి మరీ రోగులకు సేవలందిస్తున్నారు.. విపరీత లక్షణాలతో బాధపడుతున్న వారికి సైతం అత్యున్నత చికిత్సలతో నయం చేస్తున్నారు.. మూఢనమ్మకాలతో భూతవైద్యులను ఆశ్రయించి చిత్రహింసలు పడకుండా తమను సంప్రదించాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. . ఈ క్రమంలో నిత్యం ఆస్పత్రికి వచ్చే అవుట్ పేషెంట్లు పెరుగుతున్నారు.. మనసుకి వైద్యం చేయించుకుని సంతోషంగా వెళుతున్నారు.

చిత్తూరు రూరల్ : నగరంలోని జిల్లా ఆస్పత్రిలో మానసిక వ్యాధులకు సంబంధించి కొన్నేళ్లకు క్రితం ఓ విభాగాన్ని కేటాయించారు. ఇందులో నలుగురు డాక్టర్లు, మరో నలుగురు పీజీ విద్యార్థులు విధులు నిర్వర్తిస్తురు. రెండేళ్ల కిత్రం వరకు ఈ విభాగానికి నిత్యం సుమారు ఐదు ఓపీలు మాత్రమే వచ్చేవి. ఆ సంఖ్య ఇప్పుడు 25కు చేరింది. అయినా ఈ విభాగం ఉందని..ఇక్కడ మానసిక జబ్బుకు మెరుగైన వైద్యం అందుతోందని చాలా మందికి తెలియదు. మానసిక వ్యాధులను ఎలా గుర్తించాలి, నియంత్రించాలి, చికిత్సలందించాలిన అనే విషయాలను ఆస్పత్రి వైద్యులు వివరించారు.

అవగాహన అవసరం

ప్రతి వంద మందిలో ఒకరు మానసిక రుగ్మతలకు గురవుతున్నట్లు ఓ అధ్యయనం తేలింది. ఈ వ్యాధి 17– 40 ఏళ్లవారిలో అధికంగా వస్తున్నట్లు తెలిసింది. కొందరిలో 40 ఏళ్లు దాటినా వచ్చే అవకాశముంది. ఈ వయసులో ఆడవాళ్లకు ఎక్కువగా వస్తున్నట్లు సమాచారం. మనోబలంతో ఈవ్యాధిని జయించవచ్చునని డాక్టర్లు చెబుతున్నారు.


కౌన్సెలింగ్ ఇస్తున్న మానసిక వైద్యులు జయప్రియ

మానసిక సమస్యలు

మానసిక సమస్యలతో బాధపడుతున్నవారికి చుట్టూ వ్యక్తులు లేకపోయిన స్పష్టంగా మాటలు వినపడతాయి. మెదడులో రసాయనాల మార్పిడితోనే అలా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వినపడే మాటాలకు ప్రతి స్పందనగా వీరు మాట్లాడుకుంటుంటారు. దీంతో వ్యాధి సోకిన వ్యక్తి తనలో తాను నవ్వుకుంటూ, మాట్లాడుకుంటూ ఇతరులకు కనిపిస్తాడు. వాస్తవానికి ఇవి నిజాలు కాకపోవడంతో సమాజాన్ని ఎక్కువగా అనుమానిస్తాడు. వింతగా ప్రవర్తిస్తుంటారు. రోజువారి విధులను సక్రమంగా నిర్వర్తించలేకపోవడం, స్నానం చేయకపోవడం, బట్టలు మార్చుకోకపోవడం. మాటకూడా అస్పష్టంగా అర్థం కాకుండా ఉంటుంది.

ప్రారంభానికి ముందు లక్షణాలు

వ్యాధి ప్రారంభంలో వారు తమ పనులు చేసుకోవడానికి కావలసిన ఫోకస్ కోల్పోతారు. ఏదైనా పనిని ప్రారంభంలో బాగా చేస్తారు. ఆ తర్వాత ఏం చేయాలో తెలియక తికమక పడి సగంలోనే వదిలేస్తారు. ప్రవర్తనలో మార్పులు వస్తాయి, అతిగా తినడం, ఆకలి లేకపోవడం, నిద్రలేమి సమస్యలు, భ్రమపడడం వంటి లక్షణాలు గుర్తించవచ్చు. ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించడం కష్టం. ఒకవేళ గుర్తించి చికిత్సను అందిస్తే వారిలో మనో క్షీణతను నివారించవచ్చు. వంశంలో, కుటుంబంలో ఈ వ్యాధి ఉన్నవారు తొలి దశలోనే గుర్తించి జాగ్రత్త పడవచ్చు.

ఎలా వస్తుంది

వ్యాధి లక్షణాలు ఒక్కసారిగా కనబడవు. మనోబలం కోల్పోతారు. ఈ వ్యాధి పలు దశలలో అంటే కుటుంబచరిత్ర(జన్యుపరమైన కారణాలు), వ్యక్తి తల్లి గర్భంలో ఉన్నప్పుడు, ప్రసవం జరిగేటప్పుడు, ప్రసవం అయిన తర్వాత పెరిగే దశలలో ఏదైనా కారణాల వలన నాడీ కణాల ఎదుగుదల అపసవ్యంగా ఉండడం వల్ల వస్తుంది. ఆ తర్వాత తల్లిదండ్రుల పెంపకం, తొలి యవ్వన దశలో కలిగే ఒత్తిడి వల్ల వ్యాధి బయటపడుతుంది. వ్యక్తి తీవ్రమైన ప్రవర్తనతో చుట్టు ఉన్న వారికి కానీ,, తనకు తానే కానీ ఇబ్బంది కలిగిస్తున్నప్పుడు అందరికి దృష్టిలోకి వస్తుంది.

చికిత్స..నివారణ

కొన్ని రకాల జబ్బులకు జీవితాంతం మందులు వాడాల్సి వస్తుంది. ఈ మందులు మెదడులో జరిగే మార్పులను సాధారణ స్థాయిలో ఉంచడానికి తోడ్పడాతాయి. మందులు ఆపేస్తే వ్యాధి ముదిరే అవకాశం ఉంటుంది. అంటే రక్తపోటు, మధుమేహం మందుల మాదిరిగా వాడుతూ లక్షణాలను నియంత్రణలోకి పెట్టుకోవాలి.

చికిత్స తప్పనిసరి

మానసిక వ్యాధులపై అవగాహన లేకపోవడంతో చాలా మంది చేతబడి, దయ్యం పట్టిందని...చెడుగాలితో తగిలిందని చికిత్స తీసుకోకుండా వ్యాధి తీవ్రమయ్యే వరకు సమయాన్ని వృథా చేస్తుంటారు. వ్యాధి తొలి దశలోనే గుర్తించి చికిత్స ప్రారంభిస్తే సుమారుగా 20 శాతం రోగులు పూర్తిగా కోలుకునే అవకాశం ఉంది. ఏది ఏమైనా వెంటనే చికిత్స తీసుకోవడం తప్పనిసరి.– **జయప్రియ, మానసిక వైద్యులు, చిత్తూరు జిల్లా ఆస్పత్రి**



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,700

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

బురదలో కూరుకుపోయిన ఆవు


జేసీబీ సాయంతో ఆవును వెలికితీస్తున్న దృశ్యం

చౌడేపల్లె : మండలంలోని కంది చెరువు బురదలో మంగళవారం ప్రమాదవశాత్తు కూరుకుపోయిన ఆవును సురక్షితంగా కాపాడారు. వివరాలు.. నాయునివారిపాళ్యానికి చెందిన వెంకటరమణ తన ఆవును చెరువు వద్దకు తోలుకెళ్లాడు. మేత మేస్తూ ఆవు చెరువులోని బురదలో చిక్కుకుపోయింది. ఈ విషయం గమనించిన వెంకటరమణ వెంటనే ఆవును కాపాడేందుకు బురదలోకి దిగి తానూ ఇరుక్కుపోయాడు. గట్టిగా కేకలు వేయడంతో స్థానిక యువకుడు హరిప్రసాద్ అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో ఆవును బయటకు తీశారు.

సైన్స్ పోటీల్లో తడుకు విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అనిత

వడమాలపేట : మండలంలోని తడుకు ఆర్ఎస్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు ప్రధానోపాధ్యాయుడు రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పార్థివ్ వర్మ, ధనుష్ కుమార్, కిరణ్‌కుమార్ తయారు చేసిన వాటర్ ఫిల్టర్ కన్సొలేషన్ బహుమతి పొందినట్లు వెల్లడించారు. ఈ పరికరాన్ని మార్కెంటింగ్ చేసేందుకు రాష్ట్ర విద్యా పరిశోధన , అమెజాన్ సంస్థల సంయుక్తంగా ముందుకు వచ్చినట్లు వివరించారు. ఈమేరకు సంస్థ మేనేజర్ అనిత ప్రోత్సాహకంగా విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయుడు భానుప్రసాద్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కు దరఖాస్తులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని పాత జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఉచిత క్రిమినల్ న్యాయ సహాయ కార్యాలయంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. దరఖాస్తులను పోస్టు ద్వారా కానీ, జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్‌కు నేరుగా సమర్పించవచ్చని సూచించారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, మండల న్యాయసేవాధికారి కేంద్రాల్లోని నోటీసు బోర్డులు, జిల్లా కోర్టు వెబ్‌సైట్‌లో చూసుకోవాలని కోరారు.

పేయ దూడల పరిరక్షణ అవసరం


మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్

కార్వేటినగరం : పేయ దూడల పరిరక్షణ అత్యంత అవసరమని పశుసంవర్ధకశాఖ జిల్లా జేడీ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని సీకాయపట్టిడ గ్రామంలో మేలుజాతి పేయ దూడల ప్రదర్శన నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ మేలుజాతి దూడల కోసం ఆరోగ్యకరమైన కోడెల వీర్యం తప్పనిసరన్నారు. ప్రభుత్వ పశువైద్యశాలలో వీర్యం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. పశువులు ఎడకు వచ్చిన 12 గంటల లోపే కృత్రిమ గర్భధారణ చేయించాలని సూచించారు. దూడ పుట్టిన అర గంట తర్వాత ముర్రు పాలు పట్టించాలని చెప్పారు. పాడి రైతుల సౌకర్యార్థం పేయ దూడలే జన్మించే పరి/జ్ఞానం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ వాసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం మేలుజాతి దూడలను అభివృద్ధి చేయడమే కాకుండా వాటికి రాయితీపై దాణా అందిస్తోందన్నారు. పశువుల అత్యవసర చికిత్స కోసం 1962 నంబర్ వాహనాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి నష్టపోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ క్రమంలోనే కోడె దూడలపై నిర్లక్ష్యం చూపకూడదని వాటిలో ఆరోగ్యంగా ఉన్న మేలుజాతి దూడలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని వెల్లడించారు. అనంతరం మేలుజాతి దూడల ప్రదర్శనలో ఎంపికైన వాటి యజమానులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్వేశ్వర్ ఉప సర్పంచ్ చిన్న, శ్రీనివాసులునాయుడు, ధర్మయ్య, పశువైద్యాధికారులు గోవిందయ్య, బాలసుబ్రమణ్యం, అసిస్టెంట్ డైరెక్టర్ అసిఫ్, వాసు, కృష్ణ, చైతన్యకుమార్ రెడ్డి, డీఎల్‌డీఏ యశోదా, చాణక్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాలు తప్పనిసరి


సెలెస్టా కార్యక్రమాన్ని తిలకిస్తున్న మంత్రి రోజా

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం తప్పనిసరని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. మంగళవారం చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ రావురి వెంకటస్వామి, వీసీ రావూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండో రోజు నిర్వహిస్తున్న సెలెస్టా 2కె23 కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగ యువతలోని నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోందన్నారు. ఇందుకోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. అనంతరం హీరో విశ్వక్‌సేన్ విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు , లేజర్ షో కనివిందు చేశాయి.

మల్లాడి డ్రగ్స్ కర్మాగారంలో అగ్నిప్రమాదం


కర్మాగారంలో ఎగసిపడుతున్న మంటలు

రేణిగుంట: గాజులమండ్యం కెమికల్ ఎస్టేట్‌లో ఉన్న మల్లాడి డ్రగ్స్ కర్మాగారంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ప్లాంటు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. ఒక కార్మికునికి గాయాలు కాగా, రూ.10లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. గాజులమండ్యం ఎస్టేట్‌లోని మల్లాది డ్రగ్స్ కర్మాగారం సాల్వెంట్ ప్లాంటులో మంగళవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. అక్కడ పనిచేస్తున్న వారంతా భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. గాజులమండ్యం తూర్పు వీధికి చెందిన నక్కల సాయికిషోర్(27)కు మంటలు అంటుకుని వీపు భాగం కాలింది. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం రేణిగుంట సమీపంలో ఉన్న అమర ఆస్పత్రికి తరలించారు. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి ప్రమాద స్థలానికి చేరుకుని అగ్నిమాపక అధికారుల సమన్వయంతో హుటాహుటిన అగ్నిమాపక వాహనాలను రప్పించారు. ఆ ప్లాంటులో ఉన్న రసాయనాల మంటలు నీరు పోస్తే ఇంకా ఎక్కువయ్యే గుణం ఉన్నందున నాలుగు గంటలకు పైగా శ్రమించి అధికారులు చాకచక్యంగా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో రూ.10లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రమాదానికి కారణాలేవో అంతుచిక్కడం లేదని కంపెనీ యాజమాన్యం తెలిపింది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు వివరించారు. ఇటీవల రేణిగుంట సమీపంలోని పలు కర్మాగారాల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు రక్షణ చర్యల గురించి ఆయా కంపెనీలు ఏ మేరకు నిబంధనలు పాటిస్తున్నాయో అధికారులే తేల్చాల్సి ఉంది.

జగనన్నతోనే ప్రజాస్వామ్య పాలన


పాదయాత్రలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి సంఘీభావంగా నడుస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి

భాకరాపేట: సీఎం జగనన్నతోనే నిజమైన ప్రజాస్వామ్యపాలన అని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఎర్రావారిపాళెం మండలం, నెరబైలు పంచాయతీలో మహా పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రూ.లక్షకు తక్కువ లేకుండా లబ్ధిపొందారని, సీఎం జగనన్న పాలనలో ప్రతి పేదవాడికీ ఆర్థిక భరోసా లభించిందన్నారు. పల్లెలు ప్రగతి బాటలో పయనించేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుడా నిధులు విడుదల చేశారని కొనియాడారు. సీఎం ఆశయాలు, ఎమ్మెల్యే భాస్కర్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తానని, ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం ఊటబావులపల్లెకి చెందిన విద్యార్థిని మాధురి తాను జిల్లా స్థాయిలో పుట్‌బాల్ ఆడుతున్నట్లు మోహిత్‌రెడ్డికి తెలియజేయగా తాను క్రీడాసామగ్రి అందిస్తానని హామీ ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యే సంఘీభావం

తిమ్మాడివాండ్లపల్లెలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మహా పాదయాత్రకు పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథ్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఎన్నికల్లో మోహిత్‌రెడ్డి విజయం సాధించాలని ఆశీర్వదించారు.

అడగడుగునా అపూర్వ ఆదరణ

మహాపాదయాత్ర నెరబైలు పంచాయతీ తిమ్మాడివాండ్లపల్లె, చల్లకుంట, తోటి హరిజనవాడ, మడితాటివారిపల్లె, కందలమాదిగపల్లె, నెరబైలు, బజారువీధి, వెంకటాపురంకాలనీ, నెరబైలు, నాయనవారిపల్లె, సంతగేటు మీదుగా సాగింది. ఆయా గ్రామాల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు.

ఉమ్మడి జిల్లాలో న్యాయమూర్తుల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లాలో పలువురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురంలో పనిచేస్తున్న ఎస్.రమేష్‌ను చిత్తూరు మొదటి అదనపు జిల్లా జడ్జిగా బదిలీచేశారు. మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న పి.భాస్కరరావును శ్రీకాకుళానికి.. చిత్తూరు 9వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును విశాఖకు బదిలీ చేశారు.

మాజీ కౌన్సిలర్‌పై కేసు నమోదు

చిత్తూరు అర్బన్: మాజీ కౌన్సిలర్ రాజేశ్వరిపై టూటౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం నగరంలోని ఇరువారం వద్ద వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి కేటాయించిన భూమికి హద్దులు నిర్ణయించడానికి వెళితే.. రాజేశ్వరి తమ విధులను అడ్డుకున్నారని తహసీల్దార్ కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దూసుకొచ్చిన లారీ


బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

తిరుపతి రూరల్: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించేందుకు అకస్మాత్తుగా ఓ లారీ కుడి వైపు నుంచి ఎడమవైపు ఉన్న ఆర్టీసీ బస్సు లైన్‌లోకి వచ్చేందుకు ప్రయత్నించింది. బస్సుకు తగలడం, డ్రైవర్ కాలు ఎక్సలేటర్ వద్ద ఇరుక్కుపోవడం, స్టీరింగ్ లాక్ అయ్యింది. బస్సు అదుపు తప్పడం, పక్కనే ఉన్న విద్యుత్ పోల్‌ను ఢీకొట్టి మామిడి తోటలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టడం క్షణాల్లో జరిగిపోయింది. ఈప్రమాదంలో డ్రైవర్‌తో పాటు 10 మందికి గాయాలు అయ్యాయి.

ప్రమాదం ఎలా జరిగిందంటే?

చిత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం తిరుపతి నుంచి చిత్తూరుకు 35 మంది ప్రయాణికులతో వెళ్తోంది. చంద్రగిరి మండలం కొంగరవారిపల్లి సమీపంలో పక్కను వస్తున్న లారీ ఆకస్మికంగా దూసుకురావడం, డ్రైవర్ వైపు లారీ తగలడంతో రేకులు డ్రైవర్ మణి కాలికి ఒత్తుకున్నాయి. దీంతో కాలితో బ్రేకులు వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. లారీ తగలడంతో స్టీరింగ్ లాక్ అయిపోయింది. క్షణాల్లో బస్సు అదుపు తప్పి జాతీయ రహదారికి పక్కను ఉన్న మామిడి తోటలోకి దూసుకెళ్లింది. రోడ్డుకు, తోటలకు మధ్య నాలుగు అడుగుల లోతు ఉండడంతో బస్సు బోల్తా పడింది. దీంతో డ్రైవర్ మణి, కండక్టర్ చెంగల్రాయులుతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న 10 మందికి గాయాలు అయ్యాయి. డ్రైవర్ మణి కుడికాలు విరిగింది. స్థానికుల సమాచారంతో 108 వాహనాల్లో గాయపడిన వారిని తిరుపతి రుయా ఆస్పత్రికి చేర్చి, చికిత్స అందించారు. డిపో మేనేజర్ కృష్ణమూర్తి క్షతగాత్రులను పరామర్శించి, గాయపడిన వారికి రూ.2వేల చొప్పున పరిహారం అందించి ఓదార్చారు. ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సును రవాణాశాఖాధికారులు తనిఖీలుచేశారు. స్టీరింగ్ లాక్ అయినట్లు గుర్తించారు. అయితే హ్యాండ్ బ్రేక్ ఉన్నా కూడా ఉపయోగించకపోవడంపై డ్రైవర్ మణిని ఆర్టీసీ, రవాణాశాఖాధికారులు ప్రశ్నించారు. పెనుముప్పు తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

9 మందికి షోకాజ్ నోటీసులు

చిత్తూరు రూరల్: విధుల్లో అలసత్వం వహించిన 9 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీఎన్ ఆర్‌పేట వెల్ఫేర్ అసిస్టెంట్, బీఎన్‌ఆర్‌పేట, పాలూరు, పెద్దిశెట్టిపల్లె, దిగువమాసాపల్లె మహిళా పోలీసులు, బీఎన్‌ఆర్‌పేట, పెద్దిశెట్టిపల్లె, దిగువమాసపల్లె, తుమ్మింద, తాళంబేడు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నోటీసులు ఇస్తున్నామని వివరించారు.

ఏపీఆర్‌జేసీ దరఖాస్తుకు 24వరకు గడువు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఉందని విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. మే 20వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022–23వ సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. సందేహాల నివృత్తికి 93999 76999, 86888 88802నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.